క్లుప్తంగా

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

మండపేట: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా స్థానిక సంగం కాలనీలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ ఎస్. రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో అడుగు పెడుతున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. హెచ్ఎం సీహెచ్ శ్రీధర్, పీఎంసీ చైర్‌పర్సన్ సత్యవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ పశువైద్య అధికారిగా బిందు


అవార్డు అందుకుంటున్న పశువైద్యాధికారి బిందు

కె.గంగవరం: మండలంలోని పామర్రు పశువైద్యాధికారి ఎం.బిందు జిల్లా ఉత్తమ పశువైద్యురాలిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవ వేడుకలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జయపాల్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఉత్తమ పశువైద్యాధికారిగా ఎంపికవడంపై రామచంద్రపురం ఏడీ రామకృష్ణ, ద్రాక్షారామ పశువైద్యాధికారి కృష్ణార్జున్, సురేష్‌బాబు, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు ఆమెను అభినందించారు.

28 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శుక్రవారం కపిలేశ్వరపురం- 1 సచివాలయంలో 28 మందికి కంటి పరీక్షలు చేశారు. పారా మెడికల్ ఆప్తాల మిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి, వారిలో 15 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ముగ్గురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని సర్పంచ్ సాకా శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు సందర్శించారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను అందజేస్తున్న తొగరు మూర్తి

రామచంద్రపురం: వేసవిలో బాటసారులను సేదతీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని పట్టణానికి చెందిన బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ తొగరు మూర్తి అన్నారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన గమంత్రా ప్రెసిడెంట్ షేక్ తాజుద్దీన్ వారి కమిటీ సభ్యులను మూర్తి అభినందించారు. మామిడాల వెంకటేశులు, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, జాయింట్ సెక్రటరీ వీవీ చౌదరి, వలంటీర్ మణిదీప్, భార్గవసాయిరెడ్డి, కార్తిక్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు స్థలంపై జాయింట్ సర్వే

మండపేట: స్థానిక మసీదు స్థలం విషయమై త్వరలో జాయింట్ సర్వేకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు, రెవెన్యూ, మున్సిపల్ సర్వేయర్ల సమక్షంలో రీ సర్వేకు ఆదేశాలు తీసుకు వచ్చానన్నారు. ప్రైవేట్ స్థలంలో జరుగుతున్న భవన నిర్మాణం విషయమై తాను సమాచారం కోరినపుడు మున్సిపల్ అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని కామన తెలిపారు. దానిపై ఉన్నతాధికారులకు అప్పీల్ చేయనున్నట్టు కామన తెలిపారు.

పార్టీ పటిష్టతకు పని చేయాలి

రామచంద్రపురం రూరల్: పార్టీ నాయకులు, కార్యకర్తలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పార్టీ పటిష్టతకు పనిచేయాలని రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం సూచించారు. ఆ పార్టీ శ్రేణులకు శుక్రవారం ద్రాక్షారామలో సాంకేతి పరిజ్ఞానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, పార్లమెంట్ కోఆర్డినేటర్ మానేపల్లి బాలాజీ వేమా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచకశక్తులతో అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు


ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టేకిమూడి శ్రీనివాస్ తదితరులు

మండపేట: కులమత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతున్న అరాచక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. అటువంటి వారికి ఆస్కారం ఇవ్వకుండా బాధ్యతగా మెలగడం ద్వారా వైఎస్సార్‌సీపీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. పార్టీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, దాలయ్య, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, యర్రగుంట అయ్యప్ప ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు టేకిమూడి శ్రీనివాస్, ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు వంద మంది ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండపేటలో చోటుచేసుకున్న మసీదు స్థల వివాదం, వెదురుమూడిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ సందర్భంగా చేసిన కులమత రాజకీయాలు ఇందుకు నిదర్శనమన్నారు. మసీదు స్థల వివాదాన్ని మీడియా, పెద్దలు సమక్షంలో సామరస్యపూర్వకంగా పరిష్కరించి మూడు దశాబ్దాల తర్వాత మెయిన్ రోడ్డు నుంచి మసీదుకు దారి మార్గం కల్పించామన్నారు. గతంలో వైఎస్సార్ సీపీకి ఓటెయ్యని వారు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ఓటేసి రుణం తీర్చుకుంటామని ఆనందంగా చెబుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని నూతనంగా పార్టీలో చేరిన యువతకు సూచించారు. టేకిమూడి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ పాలన, మండపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషికి, పార్టీ క్యాడర్‌కు ఆయన ఇస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై తామంతా పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మన చిన తాతారావు, తాతవోలు జగదీష్, కత్తుల హరీష్, వెంకటేష్, వాసంశెట్టి సతీష్, ఆనందం శ్రీను, పలివెల దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు. తొలుత స్థానిక పాటి మీద వద్ద నుంచి కేపీ రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా పార్టీ కార్యాలయానికి తీన్‌మార్ నృత్యాలు, బాణసంచా కాల్పులతో భారీ ర్యాలీగా యువత పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల ముసుగులో చంద్రబాబు మోసం


రామచంద్రపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లు నిత్యం అబద్ధాలు చెబుతూ మరోసారి మోసానికి పాల్పడే ప్రయత్నాలు చేస్తున్నారని, పౌర సమాజం దీనిని గమనించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లోకేష్ తన 82 రోజుల పాదయాత్ర సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి వేణు మండిపడ్డారు. తన 82 రోజుల పాదయాత్రలో ప్రజలు రాకపోవటంతో తన తండ్రి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కూడా రాష్ట్రంలో పర్యటిస్తూ లేని పోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఇరుకు సందుల్లో మీటింగ్‌లు పెడుతూ ప్రజల ప్రాణాలు తీస్తున్న చంద్రబాబు నైజాన్ని గమనించిన ప్రజలు ఆయన సమావేశాలకు వెళ్లడం లేదన్నారు. పాలనలో ప్రజా అవసరాలకు అనుగుణంగా సూచనలు సలహాలు ఇవ్వాల్సిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు నిత్యం అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తూ విఫలమయ్యారని మంత్రి విమర్శించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడే నాయకుడు అవసరం అవుతాడని, ఈ రోజు రాష్ట్రంలో ప్రజలు సీఎం జగన్ పాలనతో సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. కరోనా కష్టకాలంలో చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌లు హైదరాబాద్ దాటి రాలేదని, కనీసం టీడీపీ నేతలు కూడా ఎక్కడా కనిపించలేదన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పరిపాలనలో బీసీలకు ఏం చేశారో చెప్పాలని, ఈ నాలుగేళ్లలో తమ పాలనలో బీసీలకు ఏం చేశామో చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని దీనిపై చర్చలకు రావాలని మంత్రి వేణు చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేత చంద్రబాబు తన టక్కుటమార జిమ్మిక్కులను మానుకుని ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా ఉంటే చాలని మంత్రి వేణు హితవు పలికారు.

అర్హుల చెంతకు సంక్షేమ ఫలాలు

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- టిడ్కో ప్లాట్ల వద్ద 'జగనన్నే మా భవిష్యత్తు'


టిడ్కో ప్లాట్ల వద్ద జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనతో అర్హుల చెంతకే సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ప్లాట్ల వద్ద పర్యటించారు. పాలన, పథకాల అమలుపై స్థానికుల నుంచి ప్రజాభిప్రాయసేకరణ చేశారు. టీడీపీ హయాంలో ఎన్నికల వాగ్దానాలు తుంగలోకి తొక్కడం, ఏడాదిలోనే సీఎం జగన్ హామీలు అమలు చేయడం గురించి వివరించారు. స్థానికులకు సంక్షేమ క్యాలెండర్‌లు పంపిణీ చేసి వారి కోరిక మేరకు ప్లాట్లకు వాల్ స్టిక్కర్లు అంటించారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యారమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కళ్యాణి, నీలం దుర్గ, మొండి భవాని, మారిశెట్టి సత్యనారాయణ, గృహసారథులు, వైస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి పల్లె ప్రగతి బాట

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుమూడిలో గడప గడపకూ..


వెదురుమూడి గ్రామస్తుల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: ప్రతి పల్లె ప్రగతి బాట పట్టేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని వెదురుమూడిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ తోటకు మహిళలు హారతి పట్టారు. సర్పంచ్ చోడే రామ తులసి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు మెర్ల రామకృష్ణ చౌదరి, నాయకులు చోడే సూరిబాబు, నక్కా సింహాచలంతో కలిసి ఎమ్మెల్సీ తోట ఇంటింటికీ పర్యటించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలు విస్మరణకు గురయ్యాయరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలన్నింటికీ అధికారం చేపట్టిన వెంటనే అమలు చేయనారంభించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టా కృష్ణమూర్తి, గుత్తుల దుర్గయ్య, అచంట సుబ్బారావు, తోరాటి ఆదినారాయణ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఆధ్యాత్మిక శోభ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయం మహిళా భక్తుల పారాయణలతో ఆధ్మాతిక శోభ వెల్లివిరుస్తుంది. ఈ నెల 25న శంకర జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచనల మేరకు ఆలయంలో మహిళా భక్తులతో లలితా సహస్రనామ పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

వ్యవసాయ రంగంపై యువత మక్కువ

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్ వ్యవసాయానికి ఇస్తున్న పోత్సాహాన్ని చూసి యువత వ్యవసాయరంగంపై మక్కువ చూపుతున్నారని మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. శుక్రవారం తణుకువాడ ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గుత్తుల బుల్లిరాజు, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం సంయుక్తంగా ప్రారంభించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన రైతు భరోసా, ధరల స్థిరీకరణ తదితర పథకాలతో వ్యవసాయం పురోగతి చెంది వలసలు ఆగాయని, యువత సైతం వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలతో పాటు పంట సొమ్ములు 21 రోజుల వ్యవధిలో వారి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ దడాల రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సూరంపూడి భాను, కుక్కల బాబు, పలువురు స్థానిక రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన అవసరం

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధిపై సామాజిక తనిఖీ ద్వారా నమోదు చేసే అంశాలపై పూర్తి అవగాహన అవసరమని ఎంఈఓ వై.సత్యనారాయణ అన్నారు.పాఠశాలల సామాజిక తనిఖీపై శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్లు ఎ.లక్ష్మీనారాయణ, జి.గోవిందరాజు, ఎంఎంఎస్ నారాయణ, హెచ్ఎంలందరికీ శిక్షణ ఇచ్చారు. కో-ఆర్డినేటర్ ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ సాల్ట్ సపోర్టింగ్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రాం ద్వారా విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారన్నారు. దీనిలో భాగంగా సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు.పలువురు రాయవరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీ వెండి వస్తువుల చోరీ

మండపేట: గుర్తు తెలియని వ్యక్తులు పట్టణంలోని ఓ తాకట్టు వ్యాపారం షాపులో చొరబడి కేజీ బరువుండే వెండి వస్తువులు, సెల్‌ఫోన్ కాజేశారు. శుక్రవారం జగినీ ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌కు చెందిన ఈదల వీరభద్రరావు మెయిన్ రోడ్డులో వెండి వస్తువులపై ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచి చూడగా వెండి వస్తువులు, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్టు గుర్తించారు. వీటి విలువ రూ. 25,000 వరకూ ఉంటుందని, బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల మధ్య ఘర్షణ: ఒకరికి తీవ్రగాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న జానిపాటి చినబాబు, పల్లి శ్రీనులు ఈ నెల 26న ఘర్షణ పడ్డారు. పల్లి శ్రీను గునపంతో జానిపాటి చినబాబు తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. చినబాబు ఫిర్యాదుపై గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

బాలిక వైద్యానికి రూ.ఐదు లక్షల సాయం


చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో మండలంలోని తాపేశ్వరానికి చెందిన ఐదేళ్ల చిన్నారి మాండ్రు చారుణ్య లక్ష్మీప్రియ వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. ఐదు లక్షలు సాయం మంజూరైంది. కిడ్నీ సమస్యతో లక్ష్మీప్రియ బాధపడేది. విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా వైద్యానికి రూ.13 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు నిర్ధారించారు. తండ్రి లక్ష్మీనారాయణ చిరుద్యోగి కాగా, తల్లి జ్యోతి గృహిణి. సొంతిల్లు కూడా లేని పేద కుటుంబం. అయిన కాడికి అప్పులు చేసి తమ చిన్నారికి వైద్యం చేయించారు. ఈ వ్యాధి ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి రాంబాబు, పంపన పద్మారావు తదితరులు సమస్యను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. ప్రత్యేకంగా చొరవ తీసుకుని సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి రూ. ఐదు లక్షలు మంజూరు చేయించారు. ఈ చెక్కును శుక్రవారం పార్టీ కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయం


నిత్యాన్నదాన సంస్థల నిర్వాహకులను సత్కరిస్తున్న విజయం చారిటబుల్ ట్రస్టు సభ్యులు

మండపేట: ఆంధ్రా కాశీ అన్నపూర్ణగా ఖ్యాతి గాంచిన డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. డొక్కా సీతమ్మ వర్ధంతిని శుక్రవారం మండపేటలోని పలు సంఘాలు ఘనంగా నిర్వహించాయి. విజయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ రామ్‌కుమార్ పాల్గొని డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలో దాతల సాయంతో నిత్యాన్నదాన సంస్థలు నిర్వహిస్తున్న కొల్లి విశ్వనాథం, నేరేళ్ల పైడిరాజు, డి.రాజులను ట్రస్టు ఆధ్వర్యంలో కమిషనర్ రామ్‌కుమార్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం మూడు వేల మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డి ఆశిష్, కార్యదర్శి సతీష్‌రెడ్డి, కోశాధికారి ఫణికుమార్, సభ్యులు పాల్గొన్నారు. మండపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ మెమోరియల్ మున్సిపల్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ రామ్‌కుమార్ పాల్గొని డొక్కా సతీమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ సభ్యులు స్థానిక ఆదర్శహెల్పింగ్ హ్యాండ్స్‌లో పేదలకు అన్నదానం చేశారు. మహాత్మాగాంధీ వాకర్స్ క్లబ్ నాయకుడు కోన సత్యనారాయణ డొక్కా సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సేవలు


ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత సేవలను మెరుగు పర్చేందుకు ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు సేవలను త్వరలో ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సూపరింటెండెంట్ వీరభద్రుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి వేణు ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగలపై వ్యవహరించే తీరు సమూలంగా మార్పులు రావాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులను అప్యాయంగా మాట్లాడాలని వారి ఆరోగ్య సమస్యల సానుకూలంగా విని వారిలో ఆత్మ స్థైర్యాన్ని పెంచే విధంగా ఉండాలని వైద్యులను సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు వెనుకాడవద్దని ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి సమకూర్చే ఏర్పాట్లు చేస్తామని మంత్రి చెప్పారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రి అదనపు గదులను త్వరంలోనే అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్ వీరభద్రుడిని ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు తొగరు మూర్తి, చెల్లుబోయిన ప్రకాశ్, ఆసుపత్రి వైద్యులు ఎస్.ప్రవీణ్‌కుమార్, క్రాంతికిరణ్, అశోక్, మల్లేశ్వరి, సౌజన్య సిబ్బంది సూర్యకుమారి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణానికి సిద్ధమవుతున్న సోమేశ్వరస్వామి


కల్యాణానికి సిద్ధమవుతున్న సోమేశ్వరస్వామి ఆలయం

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి గ్రామ పంచాయతీ శివారు వట్రపూడిలో కొలువైన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం కల్యాణానికి ప్రత్యేకంగా సిద్ధమవుతుంది. ఏటా గ్రామస్తులు స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు గ్రామస్తులు, ఆలయ కమిటీ, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మే ఒకటి నుంచి వారం రోజుల పాటు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించాలని వేదపండితులు నిర్ణయించారు. వారి నిర్ణయం మేరకు గ్రామస్తులు సిద్ధమై ఇప్పటికే వారి బంధువులు, స్నేహితులకు సమాచారం అందించి కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు దగ్గరుండి చేస్తున్నారు. ఈ కల్యాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరు కానున్నారు. కల్యాణం అనంతరం సాయంత్రం ఐదు గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించనున్నారు. ఈ ఏడాది స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తామని వైస్ ఎంపీపీ దూడల చినబాబు తెలిపారు.

విచారణ వేగవంతం చేయాలి


శీలలో శివకుమార్ కుటుంబీకులను పరామర్శిస్తున్న సిద్ధూ తదితర నాయకులు

కాజులూరు: గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంక్‌లో పడి మరణించిన ఆర్యావటంకు చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25)ల మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేయాలని ఉమ్మడిగోదావరి జిల్లాల పీడీఎస్‌యూ అధ్యక్షుడు బి.సిద్ధూ అన్నారు. శుక్రవారం ఆయన, పలువురు నాయకులు ఆర్యావటం, శీల గ్రామాల్లో మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ మృతదేహాలపై గాయాలు ఉన్నందున హత్య జరిగినట్టుగా కుటుంబ సభ్యులు అభిప్రాయపడుతున్నారని దాని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు అంబటి కృష్ణ, సత్యనారాయణ, ఎం.బాబు, ప్రసాద్, స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాగం పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించిన వారికి సత్కారం


పెద్దలను సత్కరిస్తున్న పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ అభివృద్ధిలో, విద్యార్థుల ప్రగతికి నిస్వార్థంగా, స్వచ్ఛందంగా సేవలందించిన గ్రామ పెద్దలు గుణ్ణం భాస్కరరావు, దంగేటి లోవరాజులను పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. గుణ్ణం భాస్కరరావు 1993 నుంచి 2003 వరకు విద్యార్థులకు గణితాన్ని బోధించేవారు. అదే విధంగా దంగేటి లోవరాజు పాఠశాల నిర్మాణ ప్రక్రియలో, నాడు-నేడులో చేపట్టిన అభివృద్ధి పనుల్లో తోడ్పాటు అందించారు. పెద్దలను దుశ్శాలువలు, పూలదండలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి రాజారమేష్, సభ్యులు జి.చిన్న, వి.సత్తిబాబు, సీహెచ్ సూర్యానారాయణ, ఉపాధ్యాయులు పి.రవికుమార్, డి.అప్పారావు, ఎం.మహాలక్ష్మి, రాయుడు త్రినాథప్రసాద్, జి.దొరబాబు, సీహెచ్ సూర్యనారాయణ, సొసైటీ చైర్మన్ కొప్పిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

నూతన ఆలయ నిర్మాణాల పరిశీలన

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సిఫారసు మేరకు టీటీడీ ఆర్థిక సాయంతో నిర్మిస్తున్న పలు నూతన ఆలయాల నిర్మాణ పనులను దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల బృందం శుక్రవారం పరిశీలించారు. దేవాదాయ శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ జి.శేఖర్, డీఈఈ జి.శ్రీనివాస్, దేవదాయశాఖ జిల్లా అధికారి కేఎస్‌వీడీవీ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్, ఈఓ ఎంవీవీ సత్యనారాయణలు పర్యటించారు.

చోరీ కేసుల్లో దోషులకు జైలు

కపిలేశ్వరపురం: వల్లూరులో వేర్వేరుగా జరిగిన రెండు చోరీ కేసుల్లో నేరం రుజువు కావడంతో దోషులకు శిక్ష విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప శుక్రవారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై జి.చంటి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.వల్లూరుకు చెందిన బళ్లా రవికుమార్ మోటార్ సైకిల్‌ను అమలాపురం మండలానికి చెందిన నిందితులు పతివాడ లోవరాజు, మండెల నాగ భాస్కరరావు దొంగిలించారన్న నేరారోపణపై 2022 డిసెంబర్ 19న అంగర పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి.చంటి కేసు నమోదు చేశారు. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో దోషులకు ఒక్కొక్కరికి ఏడాది జైలు, రూ.వెయ్యి చొప్పున జరిమానాను విధిస్తూ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప శుక్రవారం తీర్పు చెప్పారు. వల్లూరులోని వల్లూరి సీతారత్నంకు చెందిన బంగారం, వెండి, నగదులను పతివాడ లోవరాజు, మండెల నాగ భాస్కరరావులు దొంగిలించారన్న నేరారోపణపై 2019 ఆగస్టు 23న అప్పటి ఎస్సై ఎం.ఏసుబాబు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మండెల నాగ భాస్కరరావుపై నేరం ఇంతకు ముందే రుజువుకావడంతో అప్పట్లో శిక్ష పడింది. కాగా పతివాడ లోవరాజుపై నేరారోపణ కూడా రుజువుకావడంతో ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ రెండు కేసుల్లో బాధితులు తరపున ఏపీపీ విల్లా శ్రీరాముడు వాదించారు.